క్లుప్తంగా

ప్రజాప్రతినిధులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు రిఫ్రెషర్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేసి అభివృద్ధి పథం వైపు గ్రామాలను నడపాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం ఎంపీడీఓ సీతారామయ్య అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల రిఫ్రెషర్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి నాయకుడు గ్రామాలు, మండల అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



దేవాలయం ముందు ప్రతిష్టించిన ధ్వజ స్తంభం

దొనకొండ: మండలంలోని వద్దిపాడులో గ్రామస్తులు ఐక్యంగా కలిసి నూతన రామాలయం నిర్మించారు. రెండు రోజుల నుంచి పూజారి మేఘన రాఘవశర్మ బృందం పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. గురువారం రామ, సీత, లక్ష్మణ విగ్రహాలను గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించి ప్రతిష్టించారు. నూతన ధ్వజ స్తంభానికి స్త్రీలు పూజలు చేశారు. పూజారి రాఘవశర్మ వేద మంత్రాలు పఠిస్తూ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పుట్టింటి ఆడ పడుచులకు పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేశారు. ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు గ్రామస్తులు అన్నదానం చేశారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



త్రిపురాంతకం ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రమాణ స్వీకారం



తాళ్లూరు: బొద్దికూరపాడులో ప్రమాణస్వీకారం చేస్తున్న ఎస్ఎంసీ కమిటీ



దొనకొండ: పోలేపల్లిలో హాజరైన సభ్యులు

కురిచేడు: దర్శి నియోజకవర్గంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మరికొన్ని చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. కురిచేడు మండలంలోని 58 ప్రభుత్వ పాఠశాలలకు 57 పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులను ఎన్నిక చేశారు. మండలంలోని పడమర గంగవరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నిక వాయిదా పడింది. అక్కడ టీడీపీ, జనసేన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు పోటీ పడటంతో ఎన్నిక వాయిదా పడింది. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా కె.రమణ, వైస్ చైర్మన్‌గా కె.నాగరాజు, బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా వీసీ నరసయ్య, ఎం.నాగమల్లేశ్వరి, వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా టి.మల్లికార్జున, వైస్ చైర్మన్‌గా షేక్ జాన్‌బీ, కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా పి.త్రిపురయ్య, వైస్ చైర్మన్‌గా ఎం.మరియమ్మ, పడమరనాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా జి.బాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా షేక్ మీరాబీ, పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా సీహెచ్ ఆంజనేయులు, వైస్ చైర్మన్‌గా సీహెచ్ రత్తమ్మ, దేకనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా వి.సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా కె.విజయలక్ష్మి, అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా పి.ఉమాదేవి, వైస్ చైర్మన్‌గా కె.పాపయ్య, కేజీబీవీ చైర్మన్‌గా ఎస్.సుబ్బులక్షమ్మ, వైస్ చైర్మన్‌గా ఎస్.సైమన్‌లను ఎన్నుకున్నారు.

దొనకొండ: మండలంలోని 18 పంచాయతీల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 70 ఉన్నాయి. అందులో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలలో 63 పాఠశాలలు ప్రశాంతంగా జరిగాయి. మిగిలిన 7 పాఠశాలల్లో సంబంధిత కోరం లేక నిలిపివేసినట్లు మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. వద్దిపాడు, ఎస్ఎస్‌పల్లి, సంగాపురం ఏఏ, మల్లంపేట బీసీ, జనరల్, వల్లభనేనిపల్లి, తెల్లబాడు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో ఎస్ఎంసీ కమిటీ ఏర్పాటు చేస్తామని ఎంఈఓ తెలిపారు.

దర్శి: దర్శి మండలంలో 83 పాఠశాలలు ఉండగా 79 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. దేవవరం, తానంచింతల, చందలూరు, లింగన్నపాలెం గ్రామాల పాఠశాలల్లో పలు కారణాలతో ఎన్నికలు జరగలేదు. మళ్లీ వాటిని జరిపేందుకు తేదీ నిర్ణయించనున్నట్లు ఎంఈఓ-2 రమాదేవి తెలిపారు.

తాళ్లూరు మండలంలో 47 పాఠశాలలు ఉండగా 43 పాఠశాలలకు ఎస్ఎంసీ నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. శివరామపురం జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, రెండు పాఠశాలలు, తురకపాలెం ఎంపీయూపీ, తూర్పుగంగవరం జెడ్పీహెచ్ఎస్ పలు కారణాలతో నాలుగు పాఠశాలల్లో ఎన్నికలు జరగలేదు.

పెద్దారవీడు: మండల పరిధిలోని జెడ్పీహెచ్, ప్రాథమికోన్నత, ఎంపీపీ, కేజీబీవీలు మొత్తం 59 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 52 పాఠశాలల్లో పాఠశాల కమిటీ చైర్మన్ల ఎన్నికలు జరిగాయని, 7 పాఠశాలలో కోరం లేక వాయిదా వేసినట్లు ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. సానికవరం, చాట్లమడ, చట్లమిట్ల, రాజంపల్లి, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలలు, మద్దలకట్ట, ఓబులక్కపల్లి గ్రామాల్లో జెడ్పీహెచ్ పాఠశాలలు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా ఆదేశాలు వస్తే వాయిదా పడిన పాఠశాలల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కంభంపాడు పంచాయతీ మల్లవరం గ్రామం ఎంపీపీ పాఠశాలలో చైర్మన్ కోలగొట్ల వీరనారాయణరెడ్డి, చాట్లమడ అగ్రహారంలో ఎంపీపీ పాఠశాలలో చైర్మన్ బుసా వెంకటేశ్వర్లు, మద్దలకట్టలో ఎంపీపీ పాఠశాలలో చైర్మన్ జడ్డా గంగయ్య, పుచ్చకాయలపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్ వజ్రాల శ్రీనివాసరెడ్డి ఎన్నికల్లో గెలుపొందారు.

పుల్లలచెరువు: మండలంలోని 6 పాఠశాలల్లో కోరం లేక విద్యా కమిటీ ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈవో శామ్యూల్‌జాన్ గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 61 పాఠశాలలు ఉండగా 55 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. 6 పాఠశాలలు మర్రివేముల ఎస్సీ, మెయిన్, సింగుపల్లి, కుందంపల్లి, వెంకటరెడ్డిపల్లి, ఎంద్రపల్లి పాఠశాలల్లో కోరం లేక వాయిదా వేసినట్లు చెప్పారు.

త్రిపురాంతకం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 62, దూపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, త్రిపురాంతకం కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల, గణపవరం ఏపీఆర్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు జరగాయి. 57 పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏకగ్రీవం అయ్యాయి. 6 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ పోటీ ద్వారా జరిగింది. వెల్లంపల్లి పాఠశాలకు రెండు సంవత్సరాలు పూర్తి కానందున ఎన్నిక నిలిచింది. అదే విధంగా ఉమ్మడివరం ఎంపీపీఎస్ ఎస్సీ పాఠశాలలో కోరం లేక ఎన్నిక నిలిచింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీఎస్ వరప్రసాద్, ఎంఈఓ కె.తులసిమల్లికార్జున నాయక్, సాంబశివయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని 68 పాఠశాలలకు 63 పాఠశాలల్లో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీల ఎంపిక ప్రశాంతంగా జరిగింది. ఐదు పాఠశాలల్లో కోరం లేని కారణంగా వాయిదా పడింది. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎటాంటి గొడవలు జరగకుండా ఎస్ఐ నాగమల్లేశ్వరరావు గ్రామాల్లో పర్యటించి పటిష్ట చర్యలు చేపట్టారు. కోరం లేని కారణంగా మండలంలోని సుంకరవారిపాలెం, చిన ఉల్లగల్లు, రెడ్డినగర్, పులిపాడుతంగా, పలుకురాళ్లతండా పాఠశాలల్లో కోరం లేని కారణంగా ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. పెద ఉల్లగల్లు కర్నాటి మహాలక్ష్మి చైర్మన్‌గా, పొట్టిసిరి జక్రయ్య వైస్ చైర్మన్‌గా, కోఆప్షన్ మెంబరుగా అన్నపురెడ్డి భిక్షాలురెడ్డిలను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు హెచ్ఎం సుబ్బారావు తెలిపారు.



ఎస్ఎంసీ ఎన్నికల్లో పాల్గొన్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పేరెంట్స్ కమిటీ చైర్మన్లను అభినందించిన ఎమ్మెల్యే తాటిపర్తి



చెర్లో తండా స్కూల్ చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన చైర్మన్లను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అభినందించారు. గురువారం నియోజకవర్గంలోని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గానికి చెందిన పలువురు చైర్మన్లు స్థానిక పార్టీ కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్స్ పేరెంట్స్ కమిటీలు పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సర్పంచ్ అరుణాబాయి, వివిధ విభాగాల నాయకులు రాములు నాయక్, సూరె శ్రీనివాసులు, నర్రెడ్డి వెంకటరెడ్డి, రోషిరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, షేక్ వలి పాల్గొన్నారు.

చదువుకునేందుకు ఉపకార వేతనం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సెప్టెంబర్ 6 చివరి తేదీ
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు
- ఉమ్మడి ప్రకాశంలో ఏటా వందలాది మంది విద్యార్థుల ఎంపిక



గతేడాది ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన పుల్లలచెరువు జెడ్పీ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ చూపిన వారికి నాలుగేళ్లపాటు ఉపకారవేతనం అందుతుంది. దీనికోసం సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించింది.

ఎవరు అర్హులు?

2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పరిషత్, నగర, పురపాలక సంఘాలు, ఎయిడెడ్, ఆదర్శ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఏడో తరగతి పరీక్షల్లో జనరల్ కేటగిరి, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించాలి. తుది ఎంపిక సమయానికి కచ్చితంగా ఎనిమిదో తరగతిలోనూ 55 శాతం మార్కులు పొంది ఉండాలి.

రెండు విభాగాలుగా ప్రశ్నపత్రం

ఏడు, ఎనిమిదో తరగతి పాఠ్యాంశాల ఆధారంగా ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో రెండు విభాగాలుగా ఉంటుంది. మొదటి విభాంగా మానసిక, రెండో దానిలో విషయ సామర్థ్యం ఉంటుంది. ఒక్కో విభాగంలో 90 చొప్పున మొత్తం 180 ప్రశ్నలుంటాయి. పరీక్ష రాసేందుకు మూడు గంటలు సమయం కేటాయించారు.

ప్రతిభ ఆధారంగానే ఎంపిక

పరీక్షలో ప్రతిభ చూపిన వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల ఉపకార వేతనం అందిస్తారు. తొమ్మిదో తరగతిలో 55 శాతం, పదిలో 60 శాతం, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 55 శాతం మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనం ఏటా లభిస్తోంది.

ఫీజు వివరాలు

ఈ పరీక్ష రాసేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు అయితే రూ.100, ఎస్సీ, ఎస్టీ రూ.50 ఫీజులు చెల్లించి సెప్టెంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

> **ఉన్నత విద్యకు దోహదం:**
> కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం పేద ప్రజల ఉన్నత విద్యకు ఎంతో దోహదపడుతుంది. మా పాఠశాలలోని విద్యార్థులు ఏటా ఈ పథకానికి ఎంపిక అవుతున్నారు. ఈ పరీక్షలో ఇప్పటి వరకు 75 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పరీక్ష గురించి విద్యార్థులకు తెలియజేశాం. వారితో దరఖాస్తు చేయించి ప్రత్యేక ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఎక్కువ మంది ఎంపికయ్యేలా ప్రయత్నిస్తున్నాం.
> ఉమామహేశ్వరరావు, హెచ్ఎం, జెడ్పీ పాఠశాల, పుల్లలచెరువు

ఉచితంగా గడ్డిజొన్నల పంపిణీ



గడ్డిజొన్నలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమేష్

కురిచేడు: స్థానిక పశువైద్యశాలలో గురువారం పాడి రైతులకు గడ్డిజొన్నలను పశువైద్యాధికారి రమేష్ ఉచితంగా పంపిణీ చేశారు. మండలానికి 913 కిలోల గడ్డి జొన్నలు వచ్చినట్లు చెప్పారు. వాటిని పాడిరైతులు గ్రాసం పెంచుకునేందుకు అనువుగా ఒక్కో రైతుకి 3 కిలోల ప్రకారం ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను పిలిచి పంపిణీని ప్రారంభించారు.

కౌలు రైతులను గుర్తించాలి

యర్రగొండపాలెం: గ్రామాల్లో ఉన్న కౌలు రైతులను వీఆర్వోలు, వీఏఏలు గుర్తించి కౌలు కార్డులు అందజేయాలని తహసీల్దార్ ఎం.హరిబాబు ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు కార్డులు అందజేస్తే వాస్తవ పొలం పట్టాదారుడికి ఎటువంటి నష్టం జరగదని, కౌలు రైతులకు ఆ పొలంలో పండించిన పంటపై మాత్రమే అధికారం ఉంటుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. కౌలు కార్డులు ఉన్న రైతులకు పంట నమోదు, పంట నష్టపరిహారం, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. సమావేశంలో ఏవో కేవీ శేషిరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు దర్శి యువకుడు



ప్రవీణ్‌కు అందిన ఆహ్వానం

దర్శి: నెహ్రూ కేంద్రం సంఘటన్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ తరఫున కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15న ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర దిన సంబరాలకు వసంతపురం సాయి శ్రీ హరి ప్రవీణ్‌ను ఎంపిక చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం వివిధ జిల్లాల నుంచి కేవలం నలుగురిని మాత్రమే ఎంపిక చేయగా అందులో ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ప్రవీణ్ ఒకరు. హరి నెహ్రూ యువ కేంద్రం, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా జరిగిన కార్యక్రమాల్లో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సామాజిక సేవల్లో, రాష్ట్ర, జాతీయ కార్యక్రమాల్లో క్రియాశీలక సభ్యుడిగా, మై భారత్, మేరీ మట్టి మేరీ దేశ్ లాంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనటం ద్వారా ఈ అవకావం దక్కినట్లు తెలిపారు.

వధూవరులకు ఎమ్మెల్యే బూచేపల్లి ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

తాళ్లూరు (దర్శి): మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన వెంకట్రావు శ్రీను కుమారుడు వెంకట కృష్ణ, త్రివేణిల వివాహానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి బుధవారం రాత్రి హాజరయ్యారు. వధూవరులకు అక్షతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దొనకొండ భూములను పరిశీలించిన జేసీ

దొనకొండ: దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కనిగిరి ఆర్‌డీఓ జాన్ నిర్మల్‌తో కలిసి రుద్రసముద్రం భూములను పరిశీలించారు. ఆ ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్క్ పరిశీలించి ఎన్ని ఎకరాల్లో ఏర్పాటు చేశారని సంబంధిత రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ బి.రమాదేవి, డీటీఓఏ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ దర్బార్ మస్తాన్‌వలి, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని బొప్పూడివారిపాలెంలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. పాఠశాల ఎన్నికల సందర్భంగా మండలంలో పర్యటించిన సందన్భంగా గ్రామంలో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారంతో దాడి చేయగా పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 10830 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బూచేపల్లి కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు



బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డిలకు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు



ఆలయ హోమం వద్ద పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు: మండలంలోని జమ్మలమడక శ్రీదుర్గా సమేత చిన్న మల్లేశ్వరస్వామి శివాలయం ప్రథమ వార్షికోత్సవంలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చేరుకున్న బూచేపల్లి కుటుంబ సభ్యులకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. హోమ గుండం వద్ద వారు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు కృష్ణప్రసాద్, జనార్దన్‌శర్మ, దక్షిణామూర్తి, మారుతి, దశరథరామ్, అమర్నాథ్, సుబ్రహ్మణ్యంలు స్వామి వారికి మహన్యాస పూర్వక, ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత సహస్రనామాలతో కుంకుమార్చన, రుద్ర హోమాలు చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు కాపా రమణారెడ్డి, సుగుణమ్మ దంపతులు పరివార దేవతలకు పంచామృతాభిషేకాలు, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వార్లను గ్రామోత్సవం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద కోలాటం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి, నాయకులు గోపనబోయిన శ్రీనివాసరావు, అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, గొంది వెంకటప్పారెడ్డి, దుగ్గినేని వెంకట్, వేముల శ్రీనివాసరావు, కందిమల్ల గీతాంజలి, వంగల శ్రీనివాసరెడ్డి, ఇరుగుల కొండారెడ్డి, అబ్బన అంజిరెడ్డి, సోమేపల్లి సుబ్బయ్య పాల్గొన్నారు.